క్లుప్తంగా

పొత్తు కోసమే ఆరాటం

భద్రాచలంటౌన్: తెలంగాణ సీఎం కేసీఆర్ మెప్పు కోసం, బీఆర్ఎస్ పార్టీతో పొత్తు కోసమే కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆరాట పడుతున్నారని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టులు పొత్తులో భాగంగా ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శించడం సరికాదన్నారు. భద్రాచలం డివిజన్‌ను నిండా ముంచిన బీఆర్ఎస్‌తో కమ్యూనిస్టులు పొత్తు పెట్టుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో నరేష్, శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, వెంకటేష్, ప్రదీప్, రాము పాల్గొన్నారు.

సేవాతత్వం అలవర్చుకోవాలి

అశ్వారావుపేటరూరల్: బాల్యం నుంచే సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సర్పంచ్ మనుగొండ వెంకట నాగముత్యం(పెద్దోడు) అన్నారు. మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచేత శనివారం ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెల్లమేకల నాగేశ్వరరావు, హెచ్ఎం ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సిహెచ్.అప్పారావు, బి.శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌బాబు, బి.రమేష్, కార్యదర్శి బిట్రా వెంకటేశ్వర్లు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ మార్చ్

మణుగూరురూరల్: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ టీఎస్‌పీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో నేడు పెన్షన్ కాన్‌స్టిట్యూషన్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు యూనియన్ మండల అధ్యక్షుడు మాలోత్ భద్రు తెలిపారు శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానం వల్ల ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నేడు జరిగే ర్యాలీలో ఉపాధ్యాయ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం మండల కార్యదర్శి పి.బాలరాజు, ఎస్.శివకృష్ణ, రంగారావు, విష్ణు, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పోటీలు

ములకలపల్లి: మండల పరిధిలోని గుండాలపాడులో జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా క్రీడాపోటీలు ఆనందోత్సాహాల నడుమ సాగాయి. ఆటల పోటీలను ప్రారంభించిన స్థానిక సర్పంచ్ కారం కుమారి, ఎంపీటీసీ నూపా సరోజిని మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, కారం సంధ్య చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రజాపంథా మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, కారం వెంకటేశ్, కొప్పుల నాగేశ్వరరావు, వెలకం చలమన్న, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విషు పండుగ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని భద్రాద్రి హరిహర క్షేత్రంలో శనివారం విషు పండుగ (కేరళ నూతన సంవత్సరాది)ని వైభవోపేతంగా నిర్వహించారు. శబరిమల నియమానుసారం అయ్యప్ప స్వామివారికి ఆలయ నంబూద్రి శ్రీఅరుణ్ రామచంద్రన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, దర్శనం, కనిపూజ దర్శనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎల్ఓసీ అందజేత

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన కె.రామకృష్ణకు అత్యవసర శస్త్ర చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్ఓసీని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలోని తన చాంబర్‌లో బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందించారు. వైద్యసేవలకు అవసరమైన చేయూత నందిస్తామని భరోసానిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీల్లో పని చేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏరియా కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఓబీ కంపెనీల యాజమాన్యాలను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన జేఏసీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఏరియాలోని ఓబీ కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా స్థానికేతరులకు అవకాశాలు ఇవ్వడం సరికాదన్నారు. ఓబివర్కర్లకు చట్టబద్ధ హక్కులు, వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఎండి.రాసుద్దీన్, ఎల్.విశ్వనాథం, తోట రమేష్, ఉప్పుతల నరసింహారావు, వెలగపల్లి జాన్, వీరభద్రం, పి.నవీన్, సంతోష్, మంగీలాల్, ఓబీఈ వర్కర్లు పాల్గొన్నారు.

సామాన్యుడి హలీంకు క్రేజ్

- రంజాన్ ఉపవాసీలకు మసీదులో గంజి
- పలు రకాల దినుసులతో తయారీ
- పోషకాలు, రుచి అదుర్స్
- ఉచిత పంపిణీకి దాతలు, తయారీకి మసీదు కమిటీ సహకారం



ఉపవాస దీక్ష అనంతరం గంజిని సేవిస్తున్న ముస్లింలు



గంజి తయారు చేసి పార్శిళ్లు నింపుతున్న మసీదు కమిటీ సభ్యులు, మతపెద్దలు

అశ్వారావుపేట: ముస్లింలు ఉపవాస దీక్ష పాటించే రంజాన్‌మాసంలో సాయంత్రం వేళ అశ్వారావుపేట మసీద్‌లో తయారు చేసే గంజికి కుల మతాలకతీతంగా మంచి ఆదరణ ఉంటుంది. తెల్లవారుఝామున సుమారు 4.20కి ఉపవాస దీక్ష స్వీకరించిన ముస్లింలు సాయంత్రం 6.30 సమయంలో ఉపవాస దీక్ష విరమిస్తారు. దీక్ష విరమణ సమయంలో ముందుగా ఖర్జూర పండు, తర్వాత ఇతర పండ్లను తీసుకుంటారు. ఆ తర్వాత మసీదులో తయారు చేసిన ప్రత్యేకమైన గంజిని సేవిస్తారు. అశ్వారావుపేటలో తయారు చేసే ఈ గంజికి చాలా ప్రత్యేకత ఉంది.

ఇక్కడి గంజి కోసం ఉపవాస దీక్ష విరమణ సమయం (ఇఫ్తార్) కంటే ముందుగానే చాలా మంది ఇళ్లకు పార్శిళ్లు పట్టుకెళతారు. ముస్లిం మహిళలు ఉపవాస దీక్ష విరమణ సమయంలో సేవించేందుకు గంజిని పురుషులు ఇళ్లకు చేరవేస్తారు. మసీదు పరిసర ప్రాంతాల్లోని ముస్లిమేతరులు.. వీధుల్లోని మహిళలు గంజిని సేవించేందుకు ఇష్టపడతారు. వీరందరికీ మసీదు కమిటీ వారు ఉచితంగానే పంపిణీ చేస్తుంటారు. అయితే పొగలు కక్కే గంజిని సేవించడంతో ఉన్నట్టుండి శక్తి వచ్చినట్లుంటుందని ఉపవాసముంటున్నవారు చెబుతుంటారు. మంచి పోషకాలతో కూడిన ఇక్కడి గంజి కేవలం రంజాన్ మాసంలోనే లభిస్తుంది. హైదరాబాద్ వంటి మహానగరాల్లో లభించే ఖరీదయిన హలీమ్‌కు ఈ గంజి ఏమాత్రం తీసిపోదంటున్నారు గంజి అభిమానులు. తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ గంజి సామాన్యుడి హలీమ్ అని పలువురు కొనియాడుతున్నారు.

పోషకాలు అనేకం..

అత్యంత రుచికరంగా.. సువాసన పరిమళాలతో అందరినీ ఆకర్షించడమే కాకుండా గంజి పోషకాలతో కూడుకున్నది. బిర్యానీ మసాలాతోపాటు నెయ్యి, కొత్తిమీర, పుదీనా, మునగాకు, కర్వేపాకు, బొంబాయి రవ్వ, గోధుమ రవ్వ, బియ్యపు నూక, కూరగాయలతో తయారు చేసే గంజికి కట్టెల పొయ్యి ప్రత్యేక రుచిని తెచ్చి పెడుతుంది. దోరగా వేయించిన మసాలాలో కూరగాయలు, ఆకు కూరలు మగ్గనిచ్చిన తర్వాత ఎసరు మరిగే సమయంలో అదును చూసి రవ్వలు అందులో కలుపుతారు. కొన్ని సందర్భాల్లో నెయ్యిలో వేపిన రవ్వలు కలపుతారు. మటన్, చికెన్ కూడా అప్పుడపుడూ కలుపుతుంటారు. తెర్లకాగే ఎసరులో అన్నింటి సారం దిగడంతో అత్యంత రుచిగా తయారవుతుంది. ఇలా తయారు చేసిన గంజిని ఉపవాస దీక్ష విరమణ సమయంలో ఉపవాసీలు మసీదులోని గిన్నెలలో తెచ్చుకుని అందులో బూంధీ నానబెట్టుకుని సేవిస్తారు.

తయారీలో అందరి పాత్ర..

గంజి బాగానే ఉంటుంది.. గంజిచి భారీ క్రేజ్ కూడా ఉంది. కానీ గంజి తయారీ క్లిష్టమైనదే కదా.. ఇందుకోసం అయ్యే ఖర్చును ఉపవాసీలు రోజుకొకరు.. లేదా స్థానిక ప్రముఖులు గంజికి అయ్యే ఖర్చును భరిస్తుంటారు. ఎవరూ ముందుకు రాని రోజున మసీద్ కమిటీ గంజికి అయ్యే ఖర్చును భరిస్తుంది. రోజుకు సుమారు రూ.వెయ్యి చొప్పున అశ్వారావుపేట మదీనా మసీద్‌లో తయారు చేసే గంజికి ఖర్చు అవుతుంది. మసీదుకు వచ్చే ఉపవాసీలు, ఇళ్లకు తరలించే గంజిని బట్టి ఈ ఖర్చు ఉంటుంది. గంజికి అయ్యే ఖర్చును భరించాలంటే ముందుగా రోజును బుక్ చేసుకోవాల్సిందే. ఎందుకంటే ఇఫ్తార్ విందులు ఉన్న రోజున గంజి తయారు చేయరు కాబట్టి నెల మొత్తం గంజి తయారు చేస్తారనే నమ్మకం ఉండదు. అశ్వారావుపేటలోని నాలుగు మసీద్‌లలో వేర్వేరుగా గంజి తయారు చేస్తారు. ఒక్కో రోజు ఒక్కో మసీదులో ఇఫ్తార్ విందు ఉంటుంది. ఒక్కో రోజు నాలుగు మసీదుల్లో ఉపవాసాలు ఉండే వారికి ఒకే చోట ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తారు. ఈ కారణాల చేత గంజి తయారీ ఖర్చు భరించదలచిన వారు ముందుగా మసీద్ కమిటీలకు చెప్పి వారి తేదీని బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. గంజికే క్రేజ్.. అనుకుంటే గంజి స్పాన్సర్‌షిప్‌కూ అవకాశం దొరకడం కాస్త కష్టమే మరి. మరోవైపు దీని తయారీకీ ప్రాధాన్యత ఉంది. గంజిని తయారు చేసేందుకు వంట మేస్త్రీలు ఉండరు. వంటపాత్ర కడగడం నుంచి అన్ని పనులూ మసీద్ కమిటీలో ఔత్సాహికులు, ఉపావాసీలు స్వచ్ఛందంగా సేవ చేస్తారు. ఉపవాస దీక్షలో ఉండి మరీ కష్టపడతారు.

ప్రాణం లేసొచ్చినట్లు ఉంటుంది



రంజాన్ మాసం వచ్చిందంటే గంజి తాగుదామని ఎంతో ఆతృతగా ఉంటుంది. ఉపవాస దీక్ష విరమించే సమయంలో మసీద్‌లో తయారు చేసిన వేడి వేడి గంజి ఒక గుక్క గొంతులో పడగానే ప్రాణం లేసొచ్చినట్లవుతుంది.

– ఎస్‌కె.అలీం, మాజీ సదర్, అశ్వారావుపేట

గంజి ఒక్కటుంటే చాలు



రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సమంలో ఒక కప్పు గంజి ఉంటే చాలు.. ఇంకేం అవసరం లేదు. ఇఫ్తార్ సమయంలో పండ్లు, నీళ్లు ఉంటాయి. కానీ గంజిలో బూంధీ వేసుకుని తాగితే ఆ మజానే వేరు. గంజి లేని రోజు ఏదో వెలితిగా ఉంటుంది.

– ఎస్‌కె.అలీ, అశ్వారావుపేట

తయారీకి అంతా సహకరిస్తారు



గంజి తయారీ చేయడం నా బాధ్యత. నాకు మద్దతుగా మధ్యాహ్నం వేళ మసీదులో ఎవరుంటే వారు తలో చేయి వేస్తారు. గంజి తయారయ్యేందుకు కావలసిన వాటిని సభ్యులే అందజేస్తారు. అందరి సహకారంతో తయారు చేయగలుగుతున్నాం.

– ఎండి.ఖలీల్, మౌజాన్, అశ్వారావుపేట

తవ్వేశారు.. వదిలేశారు..!



రోడ్డుపై తవ్విన గుంత

భద్రాచలంటౌన్: ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటి సనఫరా చేసేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పనులు భద్రాచలం పట్టణంలో అసంపూర్తిగా ఉన్నాయి. పైప్‌లైన్ నిర్మాణం కోసం మెరుగైన రహదారులను ధ్వంసం చేసిన కాంట్రాక్టర్ తిరిగి మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ప్రతీ రోజు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. పట్టణంలోని మెడికల్ కాలనీలో మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చేందుకు భారీ గుంతను తవ్విన కాంట్రాక్టర్.. పని అయిపోయిన తర్వాత గుంతను, ఆ మట్టిని రోడ్డుపై పడేసి అలానే వదిలేశాడు. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ గుంతను గమనించని వాహనదారులు అందులో పడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు గుంతను పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సింగరేణిలో ప్రైవేటీకరణ విరమించుకోవాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీలో సర్ఫేస్ మైనర్, డ్రిల్ సెక్షన్ ప్రైవేటైజేషన్‌ను విరమించుకోవాలని శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ.. ప్రైవేటైజేషన్‌తో పర్మినెంట్ కార్మికులకు తీవ్ర నష్టం చేకూరుతుందని, దీని ప్రభావం ఏరియాలోని ఇతర కార్మికులపైనా పడుతుందని అన్నారు. టీబీజీకేఎస్ వైఫల్యం వల్ల ఓసీలు, డిపార్టుమెంట్లు, సీఎస్‌పీలతో సహా మణుగూరు ఏరియా మొత్తం ప్రైవేటుపరం అయ్యే ప్రమాదం ఏర్పడిందని విమర్శించారు. ప్రైవేటుపరం చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులందరినీ కలుపుకుని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు బి.వీరస్వామి, ఆఫీస్ బేరర్స్ ఎంవి.రాంనర్సయ్య, గోపిశెట్టి శివయ్య, కందిమల్ల రామయ్య, ఆవుల నాగరాజులు పాల్గొన్నారు.

రంజాన్ దుస్తులు పంపిణీ



రంజాన్ దుస్తులు అందజేస్తున్న జెడ్పీటీసీ నరసింహారావు

మణుగూరురూరల్: మణుగూరు మండల తహసీల్‌లో తహసీల్దార్ కె.నాగరాజు ఆధ్వర్యంలో సుమారు 500 ముస్లిం కుటుంబాలకు శనివారం రంజాన్ దుస్తులను మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మతసామరస్యానికి ప్రతీకగా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బచ్చల భారతి, కొమరం జంపేశ్వరి, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు అడపా అప్పారావు, యాదగిరిగౌడ్, ఉపసర్పంచ్ ప్రభుదాస్, మేకల రవి, రహీం, యూసఫ్ షరీఫ్, జావిద్ పాషా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణకు ప్రార్థన చేయాలి

బూర్గంపాడు: భారత దేశ రక్షణ కోసం, దేశంలో శాంతి, ప్రేమ, సమాధానం కోసం క్రైస్తవులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేయాలని హైదరాబాద్‌కు చెందిన షిలోహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ ములక మోజేస్ అన్నారు. సారపాకలోని సీఎఫ్‌సీ చర్చిలో శనివారం కుక్కునూరు, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాస్టర్ మోజేస్ మాట్లాడారు. పాస్టర్లు జాషువా, పెద్దారావు, రాజీవ్ రత్నాకర్, ఐజక్, మహిమ కుమార్, బ్రదర్ స్టీవ్ ఏలీయట్ తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలు ప్రారంభం



బస్టాండ్‌లో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: అగ్నిమాపక వారోత్సవాలు భద్రాచలంలోని అగ్నిమాపక కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. అమరులైన అగ్నిమాపక సిబ్బందికి మొదటిరోజు భద్రాచలం ఫైర్ ఆఫీసర్ గుర్రపు శ్రీనివాస్ నివాళులర్పించారు. ఈ వారం రోజులపాటు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించనున్నట్లు, అందులో భాగంగా స్థానిక ఫైర్ స్టేషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని సినిమా హాళ్లు, బస్టాండ్ ప్రాంతాల్లోని ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. లీడింగ్ ఫైర్‌మెన్ కోదండరామి రెడ్డి, కుమారస్వామి, ఫైర్‌మెన్ వెంకటేశ్వర్లు, సతీష్, శివాజీ, కిరణ్, సలీం, రమేష్, నాగేశ్వరరావ పాల్గొన్నారు.

పరిశ్రమల యజమానులకు అవగాహన



కామిరెడ్డి కొండారెడ్డిని సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

భద్రాచలం: పట్టణంలోని హరిత హోటల్‌లో జిల్లాలో పరిశ్రమల యజమానులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ్ భారతి సంస్థ అధ్యక్షుడు చరణ్ పాల్గొని మాట్లాడారు. సంస్థ తరపున యజమానుల పలు సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకుని అభివృద్ధిలో రాణించాలని సూచించారు. అనంతరం జిల్లాలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించి పలువురికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ రాణిస్తున్న కామిరెడ్డి కొండారెడ్డి, చెలమారెడ్డిలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సదస్సులో సంస్థ సెక్రటరీ శివరామకృష్ణ, జిల్లాకు చెందిన పలువురు పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరం

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం లయన్స్ క్లబ్, వైరా వారి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. ఎంపీపీ సోయం ప్రసాద్ ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 9 మందిని కంటి ఆపరేషన్‌లకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మడివి దుర్గ, ఉపసర్పంచ్ గారపాటి సూర్యనారాయణ, ఎంపీటీసీ దేవరపల్లి అజయ్, డాక్టర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి అనుచరుల రాజీనామా



రాజీనామా వివరాలు వెల్లడిస్తున్న పొంగులేటి అనుచరులు

అశ్వారావుపేట: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ ఆయన అనుచరులు పలురువు బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు సమర్పించారు. శనివారం స్థానిక పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన రాజీనామాల కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ కన్వీనర్, నియోజకవర్గ నాయకులు జూపల్లి రమేష్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకునే రాజకీయ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఆయన వెంట పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు జారే ఆదినారాయణ, అశ్వారావుపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ అట్టం రమ్యతోపాటు ఉపసర్పంచ్ రేమళ్ల కేధార్‌నాథ్, ఆసుపాక సర్పంచ్ కొణుసోతు లింగయ్య, అచ్యుతాపురం సర్పంచ్ యాట్ల నాగలక్ష్మి, బచ్చువారిగూడెం సర్పంచ్ కుంజా గంగాభవాని, ఎంపీటీసీ నండ్రు జయభారతి, గుర్రాలచెరువు ఉపసర్పంచ్ పమిడి శ్రీను, పులువురు వార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థి రయాన్

మణుగూరుటౌన్: మణుగూరులోని ఎక్సలెంట్ స్టార్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాడు. కల్వర్టుల వద్ద తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పాఠశాల విద్యార్థి రయాన్ 'ఆటో మెకానిజం ఎట్ కల్వర్ట్' పరికరాన్ని రూపొందించాడు. కల్వర్టుల వద్ద ఆర్ఎఫ్ ట్రాన్స్‌మీటర్, వాహనంలో ఆర్ఎఫ్ రిసీవర్లు అమర్చడం వల్ల వాహనం లైట్ దానికదే లోయర్ డిప్పర్‌లోకి వెళ్లి.. ఎదురుగా వచ్చే వాహనం స్పష్టంగా కనిపించడంతో ప్రమాదాలు తగ్గిపోతాయి. ఈ ప్రాజెక్టును ఇటీవల సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్‌లో ప్రదర్శించగా రయాన్‌కు బహుమతి లభించింది. ఈ సందర్భంగా రయాన్‌ను పాఠశాల చైర్‌పర్సన్ ఎండి. యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకూబ్‌షరీఫ్‌తో పాటు గైడ్ టీచర్ సురేష్‌ను అభినందించారు.

బోనస్ చెల్లిస్తేనే తునికాకు సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

చర్ల: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను చెల్లించకుంటే ఈ సీజన్‌లో తునికాకు సేకరణ చెయ్యబోమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తునికాకు సేకరణ చేపట్టిన కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.288 కోట్లు బోనస్ పెండింగ్‌లో ఉందని, పలుమార్లు ఆ పెండింగ్ బోనస్ సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. 2018 నుంచి 2022 వరకు ఒక్క భద్రాచలం నియోజకవర్గంలోనే సుమారు రూ 20 కోట్ల మేర బోనస్ బకాయిలు ఉన్నాయని, చెల్లించకుంటే ఈ ఏడాది తునికాకు సేకరణ పనులను నిలుపుదల చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కొలగాని బ్రహ్మాచారి, స్థానిక నాయకులు మచ్చా రామారావు, బందుల చంటి, తాటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ చీఫ్ లైజన్ ఆఫీసర్‌గా నియమితులైనందుకు శనివారం మణుగూరు ఏరియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంఘం నాయకులు మేకల ఈశ్వర్, పీక శంకర్, కాసర్ల అనిల్ బూర్గుల వెంకటరత్నం, మండడి సంజీవరావు, బోగ రాజలింగు, ఆంతోటి మార్కు, దాసరి వెంకటేశ్వర్లు, కాజీపేట కృష్ణ, కోట శ్రీనివాసరావు, దేవేందర్, రవిబాబు, శంకర్, అధికారులు కార్మికులు పాల్గొన్నారు.

రేపు సంత వేలంపాట

దమ్మపేట: మండల కేంద్రంలోని సంత మార్కెట్‌కు సోమవారం వేలం పాట నిర్వహించనున్నామని పంచాయతీ కార్యదర్శి పసుపులేటి కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దమ్మపేట మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే మంగళవారం సంత మార్కెట్‌కు సర్పంచ్ ఉయ్యాల చినవెంకటేశ్వరరావు అధ్యక్షతన వేలంపాట నిర్వహిస్తామని అన్నారు. వేలం పాటలో అనుకున్నంత ధర రాకుంటే వేలాన్ని రద్దుపరిచే పూర్తి అధికారం పంచాయతీకి ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

వేంకటేశ్వర ఆలయంలో అన్నదానం

అశ్వాపురం: మండల పరిధిలోని సంద్రలబోడు గ్రామంలోని బండ్లసిరిగుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేక పూజలు, భగవద్గీత, విష్ణుసహస్రనామ పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అశ్వాపురం గ్రామానికి చెందిన కూరపాటి చలపతిరావు-నిర్మల దంపతులు ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

జాతరకు హాజరైన మాజీ మంత్రి

దమ్మపేట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ముత్యాలమ్మ తల్లి జాతరకు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ముత్యాలమ్మను దర్శించుకున్న తుమ్మల, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, చిన్నశెట్టి యుగంధర్, యార్లగడ్డ బాబు, చిన్నశెట్టి సత్యనారాయణ, చిట్టిబాబు, అప్పారావు, శశిధర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఖాళీగా పశువుల నీటితొట్లు



రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోని నీరు అడుగంటుతోంది. మేతకు వెళ్లే పశువులు దహార్తి తీర్చుకోడానికి అవస్థలు పడుతున్నాయి. మండలంలోని పెంట్లం గ్రామంలో పశువుల దాహార్తి తీర్చడం కోసం నిర్మించిన నీటి తొట్లు నీరు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పశుపక్షాదుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లలో పంచాయతీ అధికారులు నీరు నింపాలని పశు యాజమానులు కోరుతున్నారు. - అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: రమేష్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్ నంబర్: 7780583907